క్లుప్తంగా

జానపద, పౌరాణిక నాటక ప్రదర్శనలు వాయిదా

చల్లపల్లి: స్థానిక ఎన్టీఆర్ పార్కులో నిర్వహించనున్న జానపద, పౌరాణిక నాటక ప్రదర్శనలు వాయిదా వేసినట్లు నిర్వాహకుడు ప్రముఖ సినీ, రంగస్థల నటుడు, నంది అవార్డు గ్రహీత బోలెం రామారావు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా పార్కులోని కళాప్రాంగణమంతా వర్షపు నీటితో నిండిపోవటం వల్ల వాయిదా వేశామన్నారు. మరలా ప్రదర్శనలు ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని చెప్పారు.

తూటికాడ, గుర్రపు డెక్క తొలగించరూ !



ఘంటసాల: వేలాది ఎకరాలకు సాగునీరందించడంతో పాటు మురుగు నీరు బయటకు వెళ్లేందుకు ఘంటసాల పరిధిలోని గంజి కాలువ, గుండేరు డ్రెయిన్లలో తూటికాడ, గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టాలని ఆయా డ్రెయిన్ల పరిధిలోని రైతులు కోరుతున్నారు. ఘంటసాల - చిలకలపూడి వెళ్లే ప్రధాన రహదారి వంతెన వద్ద గంజి కాలువలో, ఘంటసాల - దేవరకోట గ్రామాల మధ్య గుండేరు డ్రెయిన్లలో అకాల వర్షాల కారణంగా తూటి కాడ, గుర్రపు డెక్క భారీగా పెరిగింది. దీంతో వర్షాకాలం వస్తే మా పరిస్థితి ఏంటంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. పంట పొలాల్లోని మురుగు బయటకు పోవడానికి, కొంతమంది నీరు పెట్టుకోవడానికి ఉపయోగిస్తున్న ఈ డ్రెయిన్లలో అధిక వర్షాల సమయంలో నీటి పారుదల లేక పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ప్రభుత్వం డ్రెయిన్ల అభివృద్ధి చేస్తున్నాయని, నిధులు విడుదల చేస్తున్నారని ప్రకటనలు ఇస్తుంది కానీ, క్షేత్రస్థాయిలో పనులు చేపట్టడం లేదంటూ పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి గంజి కాలువ, గుండేరు డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూటికాడ తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్ పరీక్ష

పెడన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఏపీ ఈఏపీసెట్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగిన సెషన్‌లో 177 మంది విద్యార్థులకు 169 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి, అడ్మిన్ అశోక్ కుమార్ తెలిపారు. పరీక్ష ఉదయం ఒక్క పూట మాత్రమే జరిగిందన్నారు.

తెరుచుకోని ప్రభుత్వ కార్యాలయాలు

- మచిలీపట్నం, చల్లపల్లిలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు తీయని వైనం
- శనివారం సేవలకు సెలవు
- ఇబ్బందులు పడిన ప్రజలు



మచిలీపట్నంలోని ఔషధ తనిఖీ కార్యాలయం



చల్లపల్లిలోని వ్యవసాయ శాఖా కార్యాలయం

మచిలీపట్నంఅర్బన్: మచిలీపట్నం, చల్లపల్లిల్లో పలు ప్రభుత్వ కార్యాలయాలు శనివారం తెరుచుకోలేదు. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరిగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా, పాలనాపరమైన నియంత్రణ, పర్యవేక్షణలపై ఇప్పటికీ పట్టు సాధించలేకపోతున్నదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. స్వయంగా మంత్రి ఇలాకాలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఔషధ తనిఖీ అధికారి (డ్రగ్ ఇన్‌స్పెక్టర్) కార్యాలయం తాళాలు వేసి శనివారం సేవలకు సెలవు అంటూ దర్శనమిచ్చింది. ప్రభుత్వ నియంత్రణలో ఉండాల్సిన కీలక విభాగాలు నిర్లక్ష్యానికి ఉదాహరణలుగా మారుతున్నాయి. ఔషధ వ్యాపారులు, మెడికల్ షాప్ యజమానులు, ఆరోగ్య రంగ ప్రతినిధులు తమ లైసెన్స్ సంబంధిత కార్యకలాపాల కోసం వచ్చేవారు కార్యాలయం మూసి ఉండటంతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతకాలంగా ప్రతి శనివారం ఇదే పరిస్థితి కొనసాగుతోందని స్థానికులు, వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో విధులు నిర్వర్తించాల్సిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దర్శనార్థంగా మాత్రమే రావడం, ప్రతి రోజు కార్యాలయం సిబ్బంది మాత్రమే విధులకే పరిమితమై ఉన్నారనే విమర్శలున్నాయి. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. ఈ పరిణామాలపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

చల్లపల్లిలో తాళం వేసి ఉన్న వైనం

చల్లపల్లి: స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయం తాళాలు శనివారం తీయలేదు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభం కానుండడంతో రైతులు ఏదో ఒక కారణాలతో కార్యాలయాలకు వస్తుంటారు. అయితే మండల వ్యవసాయాధికారి సాయిసింధూని ఈ విషయమై 'సాక్షి' అడగ్గా తాను సెలవులో ఉన్నానని, సిబ్బంది వచ్చి ఫీల్డ్‌కు వెళ్లి ఉంటారని తెలిపారు. వ్యవసాయ కార్యాలయానికి రైతులు వచ్చిన సమయంలో అధికారులు లేనప్పుడు కనీసం సమాధానం చెప్పేందుకు ఎవరైనా సిబ్బంది కార్యాలయంలో ఉంటే బాగుంటుందని పలువురు రైతులు వాపోయారు. తాళం వేసి ఉండడంతో కనీస సమాచారం తెలియక తిరుగు ముఖం పట్టాల్సి వస్తోందని చెప్పారు.

విజయం సాధించాలంటే క్రమశిక్షణ అవసరం



కిశోర్‌కుమార్‌ను సత్కరిస్తున్న వినియోగదారుల కమిషన్ సభ్యులు పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల, సిబ్బంది

చిలకలపూడి(మచిలీపట్నం): విధి నిర్వహణలో విజయం సాధించాలంటే క్రమశిక్షణ ఎంతో అవసరమని కృష్ణా జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిశోర్‌కుమార్ అన్నారు. కమిషన్ అధ్యక్షుడిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన సందర్భంగా కమిషన్ కార్యాలయంలో శనివారం ఆయనకు వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1991 మే నెలలో కమిషన్‌లో చేరానన్నారు. అప్పటి నుంచి ఎన్నో ప్రాంతాల్లో పనిచేసి నిబద్ధతతో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నానని చెప్పారు. పనే దైవంగా ఏరోజైతే ప్రతి ఒక్కరూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తారో అప్పుడు ఆత్మసంతృప్తి పొందుతారన్నారు. సభ్యులు నందిపాటి పద్మారెడ్డి మాట్లాడుతూ.. కిశోర్ కుమార్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు సభ్యులుగా తాను ఎంతో నేర్చుకున్నానన్నారు. ఆయన పదవీ విరమణ చేయటంతో తనకు గురుతర బాధ్యతను అప్పజెప్పారని, ఆ బాధ్యత ఆయన నుంచి నేర్చుకున్న పనివిధానంతో గురువును మించిన శిష్యుడిగా పేరుప్రఖ్యాతలు తెచ్చుకుంటానని స్పష్టం చేశారు. అనంతరం ఆయనను మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తొలుత వినియోగదారుల కమిషన్ భవనానికి నిధుల సహకారం అందించిన ఐఆర్ఎస్ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి దంపతులను ఈ వీడ్కోలు కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. కమిషన్ సూపరింటెండెంట్ కర్ర సునీల్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పోతురాజు, న్యాయవాదులు బాలాజీ, కూనపరెడ్డి శ్రీనివాస్, కమిషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు సమస్యలు పరిష్కరించండి

గుడివాడటౌన్: కొత్త బైపాస్‌రోడ్డు ఇరు వైపులా డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని భవిష్యత్ భద్రతాదళం సభ్యులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మనోహర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. దళం సభ్యులు మాట్లాడుతూ బైపాస్ రోడ్డుకు ఇరువైపుటా సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఆక్రమణలు, మెరక తోలకాల వలన వర్షంవస్తే నీరు నిల్వ ఉంటుందని తెలిపారు. దీని వలన రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలతో రోడ్డు గుంతలమయం అవుతోందన్నారు. తక్షణమే డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని వారు కోరారు. భవిష్యత్ భద్రతాదళం సభ్యులు ఎండీ తెహర్‌బాషా, జి. పూర్ణచంద్రరావు, ఎం.దుర్గారావు పాల్గొన్నారు.

ఆర్‌యూబీల నిర్మాణంపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

పెడన: పట్టణంలో రైల్వేశాఖ నిర్మించ తలపెట్టిన రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)లపై ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సమీక్షించారు. రైల్వే శాఖ ఎస్ఈ శ్రీనివాస్‌తో పాటు ఆర్అండ్‌బీ, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఆర్‌యూబీల నిర్మాణం వల్ల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు నష్టపోయే వారి జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ డ్రెయిన్లు, ఆర్అండ్‌బీ రోడ్డులతో పాటు ప్రైవేటు ఆస్తులు కూడా నష్టపోతాయని, నష్టపరిహారం విషయంలో రైల్వే శాఖాధికారులు సానుకూలంగా స్పందించాలన్నారు. రక్షణ ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన ఆర్‌యూబీల నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ఆర్అండ్‌బీ ఏఈ కిశోర్, ఇన్‌చార్జి తహసీల్దార్ అనిల్‌కుమార్, టీపీవో సుజనకుమారి, టౌన్ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ జితేంద్ర, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పెడన: పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. పట్టణంలో ఉన్న హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన నూతన కమిటీ శనివారం బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు సారథ్యంలో ఎమ్మెల్యేను టీడీపీ కార్యాలయంలో కలిశారు. శ్మశాన వాటిక అభివృద్ధికి ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలిసి సహకరించాలని కమిటీ ఎమ్మెల్యేను కోరింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్మశానవాటిక అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే కొంతమేర నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేను కలిసి వారిలో కమిటీ అధ్యక్షుడు బొడ్డు దీక్షనందుడు, ఉపాధ్యక్షుడు బళ్ల ప్రసాద్, కార్యదర్శి వాసా సాంబశివరావు, కోశాధికారి వుటుకూరి ప్రకాశరావు, సభ్యులు కమ్మగంటి వెంకటేశ్వరావు, యక్కల శ్యామలయ్య, పృథ్వీ వినోద్, తమ్మా భీమయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తల్లి జాతర



మోపిదేవిలో ఊరేగింపు చేస్తున్న భక్తులు

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో అంకమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. ఉదయం కొండేటి వంశీకుల ఇలవేల్పు అయిన అమ్మవారిని బయటకు తీసి ఊరేగింపుగా సమీపంలోని కృష్ణానదికి తరలి వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, డప్పుకళాకారుల సందడితో గ్రామంలో ఊరేగించారు. ప్రతి గ్రామదేవత వద్ద సంబరాలు చేస్తూ తెల్లవారుజామున అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. దారి పొడవునా అమ్మవారికి ముడుపులు చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. రెండు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

మేళ్లమర్తిలంకలో పోతురాజు సంబరాలు

మండలంలోని మేళ్లమర్తిలంకలో పోతురాజు సంబరాలు శనివారం వైభవంగా జరిపారు. కమిటీ ఆధ్వర్యంలో ఉదయం పోతురాజు శిలలతో సమీపంలోని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం డప్పుకళాకారుల సందడి, యువకుల కేరింతల మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దారిపొడువునా చల్లనీళ్ల వారపోస్తూ స్వామివారికి పూజలు నిర్వహించారు. బంధుమిత్రుల రాకతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

వైభవంగా పోలేరమ్మ జాతర



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కృత్తివెన్ను: మండల పరిధిలోని కొమల్లపూడి పాటిమీద మూడేళ్ల ఒకసారి చైత్ర మాసంలో జరిగే శ్రీపోలేరమ్మ జాతర మహోత్సవాలు భక్త బృందం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 21 నుంచి 25 వరకు జరుగుతున్న ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు. నియోజక వర్గంతో పాటు ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు.

పెండ్లి కుమారుడిగా రాజశేఖరస్వామి వారు



అవనిగడ్డ: స్థానిక రాజశేఖర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పెండ్లి కుమారుడిని చేశారు. రాజశేఖరస్వామి వారికి వేకువ జామునే విశేష పూజలు జరిపారు. ఆలయ అర్చకులు ఘంటసాల రాజశేఖరశర్మ, సంతోష్, పవన్‌లు స్వామివారికి పెండ్లి కుమారుడి అలంకారం చేశారు. ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

రాజశేఖరస్వామి హుండీ ఆదాయం రూ.2.91 లక్షలు

స్థానిక రాజశేఖరస్వామి ఆలయంలోని హుండీ కానుకలను శనివారం లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన లెక్కింపులో రూ.2,91,184 వచ్చిందని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు చెప్పారు. 16 నెలల కాలానికి గాను హుండీ లెక్కింపు చేపట్టామన్నారు. లెక్కింపును మచిలీపట్నం దేవదాయ తనిఖీ అధికారి శ్రీనివాస్, ఈవో పర్యవేక్షించారు.

నేడు అమ్మవారికి లక్ష మల్లెల అభిషేకం

చల్లపల్లి: మండల పరిధిలోని నడకుదురులో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీపృధ్వీశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కంఠంరాజు గణపతి దీక్షితులు తెలిపారు. ఈసందర్భంగా అమ్మవారికి లక్షమల్లెలతో అభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు నుంచి ప్రారంభమయ్యే అభిషేక పూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

కొనసాగుతున్న అమలేశ్వరి దేవి ఉత్సవాలు



పెడన: మండల పరిధిలోని దావోజిపాలెం గ్రామంలో వేం చేసి ఉన్న అంకెం వారి ఇలవేల్పు విజయ అమలేశ్వరి దేవి ఉత్సవాలు శనివారంతో మూడో రోజుకు చేరాయి. 11 సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతర ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు అమ్మవారిని రోజుకొక రూపంలో అలంకరించనున్నారు. ప్రతి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు.